క్లుప్తంగా

ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ


కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

తలకొండపల్లి: ఆరోగ్య భారత్ దిశగా కేంద్రం ప్రభుత్వం పనిచేస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు తిర్మనీ రవిగౌడ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ విజయం ఖాయమన్నారు. బుధవారం మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. రవిగౌడ్ మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్‌తో నిరుపేదలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మండల అధ్యక్షుడు రవిగౌడ్, బీజేవైఎం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ అనిల్, శక్తి కేంద్ర ఇన్‌చార్జి కుమార్, సత్యం, శ్రీశైలం, శ్రీను, గణేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

250మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం పోలెపల్లిలో బుధవారం ఆయుష్ సంచార వైద్యశాల మరియు డాక్టర్స్ ఫార్మసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. శిబిరంలో డాక్టర్స్ ఫార్మసీ ఎండీ డా.సునీత ఆధ్వర్యంలో 250 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో పోలెపల్లి ఎంపీటీసీ సభ్యులు కుమార్, మాజీ ఉపసర్పంచ్ లాలయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ ధూంధాం

యాచారం: మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో గురువారం తెలంగాణ ధూంధాం కార్యక్రమం ఉంటుందని బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాశ్ర భాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 7 గంటలకు గ్రామంలోని ప్రధాన చౌరాస్తాలో జరిగే ధూంధాం కార్యక్రమానికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి తీగల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నేతలు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్ పాల్గొంటారని తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు సర్వసభ్య సమావేశం

కడ్తాల్: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- సీఐ సైదయ్య

యాచారం: ఎన్నికల నింబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని యాచారం సీఐ సైదయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నింబంధనల ప్రకారమే డబ్బులు తీసుకెళ్లాలని, అత్యవసర పరిస్థితుల్లో డబ్బులు తీసుకెళ్లాలంటే ఆధారాలు చూపించాలని సూచించారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని అన్నారు. సాగర్‌రోడ్డుపై అతివేగంగా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని అన్నారు. పండుగకు బంధువుల ఇళ్లకు వెళ్లే ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

రూ.1.03 లక్షల నగదు స్వాధీనం..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉప్పరిగూడ వద్ద బుధవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.1.03 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మైబెల్లి తెలిపారు. పట్టుబడిన డబ్బును రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు ఆయన చెప్పారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తుక్కుగూడ: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఆర్ఓ) సూరజ్‌కుమార్ సూచించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా 21 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్, ఏఈ భార్గవ్‌రెడ్డి, మేనేజర్ వెంకటేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పందిరి సాగు.. భలే బాగు

- అధిక దిగుబడి, ఆశించిన లాభాలు
- చీడపురుగులు, తెగుళ్ల వ్యాప్తి కూడా తక్కువే
- రాయితీలతో ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం


ఆరుట్లలో పందిరి విధానంలో బీర సాగు

మంచాల: పందిర్ల పంట సాగుతో అధిక దిగుబడితో పాటు మంచి లాభాలు కూడా వస్తున్నాయి. దీనికి తోడు పంటచేన్లకు చీడపురుగులు, తెగులు వంటి వ్యాప్తి కూడా తక్కువ. రైతులు పందిర్ల పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన్ మంత్రి సంచాయ్ యోజన' పథకం కింద (వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కంపోనెంట్) సన్న, చిన్నకారు రైతులకు చేయూతనిస్తోంది. ఈ పథకం కింద 5 ఎకరాల లోపు వ్యవసాయ భూమి గల రైతులకు పది గుంటల్లో పందిర్ల పంట సాగుకు చేయూతను అందిస్తుంది. పది గుంటల్లో పందిర్ల సాగు చేసే రైతులకు కడీలు పాతేందుకు, గోతులు తీయుటకు, మొక్కలు నాటుటకు, మొక్కల ఖర్చులు, ఎరువుల ఖర్చులు, మొక్కల సంరక్షణ నిమిత్తం రూ.44వేలు అందిస్తుంది. ఎస్సీ, ఎస్టీ రైతులు అయితే 10శాతం రైతువాట చెల్లించాలి. ఇతరులు 20శాతం రైతువాట చెల్లించాలి. ఇలా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతులకు 90శాతం సబ్సిడీ, ఇతరులకు 80 శాతం సబ్సిడీపై పది గుంటలకు మొత్తం రూ.54వేలు అందిస్తోంది.

మంచి లాభాలు...

పందిర్ల పంట సాగు చేయడం వలన పంటచేను చీడపురుగులు ఆశించకపోవడంతోపాటు ఎక్కువ దిగుబడి వస్తుంది. కాపు కూడా బాగా కాస్తుంది. మార్కెట్లో పందిర్ల సాగు ద్వారా వచ్చిన కూరగాయాలకు మంచి డిమాండ్ ఉంటుంది. నేలపై పండే పంటలు ఎండలకు, వర్షాలకు దెబ్బతింటాయి. కాత కూడా అశించనంత రాదు. తెగులు, పురుగుల నివారణ నిమిత్తం పిచికారీ చేసిన క్రిమి సంహారక మందులు కూడా సక్రమంగా పనిచేయవు. అదే పందిర్లపంట సాగుకు ఏలాంటి క్రిమి సంహారక మందులు పిచికారీ చేసినా నేరుగా మొక్కపై పూర్తిగా పడుతుంది. దీంతో తొందరగా తెగులు, చీడపురుగుల నివారణ అవుతుంది. నేలపై పండించే పంటకంటే మూడింతలు అధికంగా పందిర్ల సాగు పై దిగుబడి వస్తుంది. రైతులు పందిర్ల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని ధికారులు చెబుతున్నారు.

రెండు ఎకరాలకు రాయితీ ఇవ్వాలి



పందిర్ల సాగుకు రెండుఎకరాల వరకు రాయితీ కల్పించాలి. రైతులు అర ఎకరం చొప్పున రెండు ఎకరాల్లో నాలుగు రకాల పంటలు సాగుచేయడం జరుగుతుంది. మార్కెట్‌లో ఒక పంట కాకుంటే మరో పంటకు డిమాండ్ వచ్చి లాభాలు వస్తాయి. నిరంతరం రైతులకు చేతి నిండా పనిదొరుకుతుంది. – **అంజిరెడ్డి, రైతు, ఆరుట్ల**

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ప్రధాన్ మంత్రి సంచాయ్ యోజన పథకం (వాటర్ షెడ్ పథకం) కింద మంచాల మండల ంలో చిత్తాపూర్ ప్రాజెక్ట్ పరిధిలో చిత్తాపూర్, ఆరుట్ల, లింగంపల్లి, తిప్పాయిగూడ, తాళ్లపల్లిగూడ, పటేల్ చెరువు తండా గ్రామాల రైతులకు మాత్రమే అవకాశం ఉంది. ఆసక్తిగల రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – **కనకమహాలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి, ఇబ్రహీంపట్నం**

ప్రయాణికులకు దసరా బొనాంజా

- ఆర్టీసీ బస్టాండ్లలో లక్కీడ్రా బాక్సుల ఏర్పాటు


లక్కీడ్రా బాక్సులో టికెట్లు వేస్తున్న ప్రయాణికులు

హయత్‌నగర్: దసరా, బతుకమ్మ పండుగలను పురస్కరించుకుని టీఎస్ ఆర్టీసీ ప్రయాణికులకు లక్కీడ్రా ద్వారా బహుమతులను అందిస్తున్నట్లు హయత్‌నగర్–1 డిపో మేనేజర్ జలగం విజయ్ తెలిపారు. బుధవారం ఆయన హయత్‌నగర్ బస్‌స్టేషన్‌లో లక్కీ డ్రా బాక్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ... ప్రయాణికులను ఆకర్షించేందుకు ఆర్టీసీ పలు పథకాలను అమలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ప్రతీ రీజియన్ పరిధిలో బుధవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు రోజుకు పది మంది పురుషులు, పదిమంది మహిళలకు.. ఒక్కొక్కరికి రూ.9,900 చొప్పున మొత్తం 110 మందికి రూ.11 లక్షలు బహుమతులుగా అందజేస్తామని తెలిపారు. ప్రయాణికులు తమ టికెట్ వెనుక ఫోన్ నంబర్‌ను రాసి స్త్రీ, పురుషులకు వేరు వేరుగా కేటాయించిన డ్రా బాక్సుల్లో వేయాలని సూచించారు.

కసిరెడ్డిని అసెంబ్లీకి పంపుదాం

- తండాల్లో ఎన్ఎస్‌యూఐ ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని ఎక్వాయిపల్లి, ఇందిరానగర్ తండాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టబోయే 6 గ్యారెంటీ స్కీంల గురించి ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణ రెడ్డిని ప్రజలు ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుమన్‌గౌడ్, అజీజ్, మల్లయ్య, చెన్నయ్య, దర్శన్, ప్రవీన్, క్రాంతి, నవీన్, జశ్వంత్, శివ, విజయ్, చరణ్ పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు వివరిద్దాం


తుక్కుగూడ: మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

- మంత్రి సబితాఇంద్రారెడ్డి
- బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం

తుక్కుగూడ: మహేశ్వరం అభివృద్ధి కోసం మరోమారు నన్ను నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి సబితారెడ్డి కోరారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని తుక్కుగూడ, సర్దార్‌నగర్ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మున్సిపాలిటీలో ఫ్లైఓవర్, ప్రభుత్వం ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా తుక్కుగూడ, బాసగూడకు చెందిన పలువురు యువకులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తుక్కుగూడలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడే లక్ష్మయ్యయాదవ్, వైస్ చైర్మన్ భవానీ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు రవినాయక్, లావణ్య, సుమన్, తేజస్విని, నాయకులు రాజు, శ్రీధర్‌గౌడ్, వెంకట్‌రాజీరెడ్డి, పద్మ, బుచ్చిరెడ్డి, రాజు, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని మరోమారు గెలిపించుకుందాం

- నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి తీగల కృష్ణారెడ్డి
- ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ నేతలకు దిశానిర్దేశం


సమావేశంలో మాట్లాడుతున్న తీగల కృష్ణారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి తీగల కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతల సమావేశాన్ని బుధవారం స్థానిక వైష్ణవి గార్డెన్‌లో నిర్వహించారు. ఎన్నికలప్పుడు వచ్చే నాయకులను కాకుండా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. బూత్‌స్థాయి నుంచి చక్కటి ప్రణాళికతో పార్టీ శ్రేణులు ముందుకెళ్లాలన్నారు. పనిచేసే కార్యకర్తలకు, నాయకులకు తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. నాలుగోసారి ఎమ్మెల్యేగా కిషన్‌రెడ్డిని గెలిపించుకుందామన్నారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి కేవలం ఈ నాలుగేళ్లలో జరిగిందన్నారు. కలెక్టరేట్, ఆర్డీఓ, డివిజన్ పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఈ నియోజకవర్గానికే తెచ్చుకున్నామన్నారు. 100 పడకల ఆస్పత్రి, సమీకృత వెజ్, నాన్‌వెజ్, కూరగాయల మార్కెట్లు, సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాలకు నూతన భవన నిర్మాణాలు, డబుల్, ఫోర్‌లైన్ రోడ్ల నిర్మాణాలు చేసామన్నారు. స్థానికంగానే ఉంటూ సేవచేస్తున్న తనను ప్రజలు నాలుగోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు అల్వాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం నిర్వహించండి..

యాచారం: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...టీఎస్ఐపీసీ నిధులతో గ్రామాల్లోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు నిర్మించామని అన్నారు. గ్రామంలో అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ సహకారంతో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పాశ్ర భాషా, నక్కర్తమేడిపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ శివలీల, పీఏసీఎస్ డైరెక్టర్ స్వరూప, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కిషన్ తదితరులు పాల్గొన్నారు.


కడ్తాల్: భవానీదేవి అలంకరణలో అమ్మవారు


తుర్కయంజాల్: కృష్ణమోహన్ రావును సన్మానించిన నిర్వాహకులు


ఆమనగల్లు: లలితా సహస్రనామ పారాయణం చేస్తున్న మహిళలు

కొనసాగుతున్న ఉత్సవాలు

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండపాల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు జరిపారు. ఆలయాల ఆవరణల్లో మహిళలు బతుకమ్మ ఆటలు ఆడారు. పలుచోట్ల హోమాలు నిర్వహిచారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖులు హాజరై ప్రజలకు నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. – సాక్షి, నెట్‌వర్క్

అవినీతి పాలనను అంతమొందిద్దాం


తుక్కుగూడ: అందెల సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు

తుక్కుగూడ: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ అవినీతి పాలనను అంతం చేయాల్సిన సమయం ఆసన్నమయ్యిందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలకు చెందిన పలువురు నాయకులు బుధవారం అందెల సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికలకు 45 రోజులు కష్టపడి పని చేయండి.. రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. బీజేపీ పాలనలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో గోవర్ధన్, రవీందర్, ప్రకాష్, భాస్కర్‌గౌడ్, మల్లేష్, నవీన్, రమేష్, వంశీ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. మున్సిపల్ చైర్మన్ మధుమోహన్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వినాయకహిల్స్ కాలనీలో..

బడంగ్‌పేట్: బీజేపీ మహేశ్వరం నియోజకర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ బుధవారం చాయ్ పే చర్చ కార్యక్రమంలో భాగంగా బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని వినాయకహిల్స్ కాలనీలో పర్యటించారు. కాలనీవాసులతో భేటీ నిర్వహించి బీజేపీకి ఓటువేయాలని అభ్యర్థించారు.

'యుద్ధభేరి'ని విజయవంతం చేద్దాం


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హుడాకాంప్లెక్స్: ఇందిరాపార్కు వద్ద నవంబరు 5న జరిగే మాదిగల యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పంతం ఉపేందర్ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీను ఆదేశాల మేరకు బుధవారం చైతన్యపురి డివిజన్ నుంచి ఎల్‌బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతామని హామీ ఇచ్చి ఇప్పటివరకు బిల్లు పెట్టలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా వర్గీకరణకు సహకరించటంలేదన్నారు. మాదిగ జాతిని కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్తామన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి నర్సింహ, జాతీయ మహిళా అధ్యక్షురాలు రుక్కమ్మ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుగుణమ్మ, ఏసోబు, జయన్న, ఎల్లయ్య, లక్ష్మయ్య, జగదీశ్, నాగరాజు, సైదులు, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం: వనస్థలిపురం సచివాలయనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 4వ రోజు బుధవారం ఉత్సవ మూర్తులకు అభిషేకం, కుబేర హోమం, లక్ష తులసీ పుష్పార్చన, శ్రీవారి కల్యాణ మహోత్సవం, అన్నప్రసాద వితరణ, హనుమత్ వాహనంపై తిరువీధి ఉత్సవం, బ్రహ్మశ్రీ అద్దంకి శ్రీనివాసరావుచే లక్ష్మీ వైభవం–పురుషాకార స్వరూపం ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వైస్ చైర్మన్ జగదీశ్‌కుమార్, కోశాధికారి శ్రీధర్, శ్యామల, రామలక్ష్మి, సాంబశివరావు, సునీల్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు, రమేష్‌బాబు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

పేదలకు ఆర్థికసాయం అందజేత


బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న శ్రీనివాస్

కడ్తాల్: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన పూసల నారమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని బుధవారం జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి రూ.4 వేలు ఆర్థికసహాయాన్ని అందించారు. ఆయనవెంట సేవాదళ్ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు బుచ్చయ్య, శేఖర్, భానుకిరణ్ రాజేశ్, ప్రవీన్‌గౌడ్, చంద్రశేఖర్, మహేశ్, శ్రీను, గణేశ్, శ్రీకాంత్, మహేశ్ తదితరులు ఉన్నారు.

రాధాకృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

మండల పరిధిలోని మద్రిపల్లికి చెందిన నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ, రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ బుధవారం పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, రైతుబంధు కోఆర్డినేటర్ వీరయ్య, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, సర్పంచ్ భాగ్యమ్మ, నాయకులు భాస్కర్‌రెడ్డి ఉన్నారు.